క్లుప్తంగా

ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి



మాట్లాడుతున్న ఆర్‌ఓ విజయకుమారి

పరిగి: ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని ఆర్‌ఓ విజయకుమారి అన్నారు. మంగళవారం పట్టణ కేంద్రంలో పీఓఎస్, ఏపీఓఎస్‌లకు ఎన్నికల నిర్వహణపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ఆమె మాట్లాడారు. ఎన్నికల నియమ నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికలు జరిగే ప్రాంతాల్లో ఆంక్షలు విధిస్తామని, నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని చెప్పారు. పోలింగ్ స్టేషన్లలో ఇప్పటికే అన్ని సదుపాయాలను సమకూర్చేలా చర్యలు తీసుకున్నామని, ఎక్కడా ఎలాంటి సమస్య లేకుండా పర్యవేక్షిస్తున్నట్లు ఆమె వెల్లడించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి హరిశ్చందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణతోనే న్యాయం

తాండూరు టౌన్: ఎస్సీ వర్గీకరణతోనే విద్య, ఉద్యోగ, రాజకీయ తదితర రంగాల్లో మాదిగలకు, ఉపకులాలకు న్యాయం జరుగుతుందని, అందుకు శీతాకాల పార్లమెంటు సమావేశాల్లో వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురానున్నామని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్ మాదిగ తెలిపారు. మంగళవారం ఈ నెల 18న హైదరాబాద్ జింఖానా మైదానంలో నిర్వహించనున్న మాదిగల విశ్వరూప మహాసభ కరపత్రాన్ని ఎమ్మార్పీఎస్ నాయకులు ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడారు. 18న నిర్వహించే సభకు పెద్ద సంఖ్యలో మాదిగలు తరలిరావాలని కోరారు. ఇందులో ఎమ్మార్పీఎస్ నాయకులు సత్యానంద్, శ్రీకాంత్, జాని, దేవప్ప, అనంతయ్య, రాందాస్, భరత్ ఉన్నారు.

సభకు తరలిరండి

తాండూరు రూరల్: ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ 'మాదిగల విశ్వరూప మహాసభ' నిర్వహిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లిఖార్జున్ మాదిగ, మండల ఇన్‌చార్జి జినుగుర్తి నర్సింహులు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో భాగంగా నవంబర్ 18న హైదరాబాద్‌లో జరిగే సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం



బైక్‌ర్యాలీ నిర్వహిస్తున్న కిరణ్ బూనేటి

దోమ: బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని రాష్ట్ర కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు మారుతి కిరణ్ బూనేటి అన్నారు. మంగళవారం దోమ మండలం మైలారం గ్రామంలో వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్న అనంతరం ఆయన ఆయా గ్రామాల్లో బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు ప్రజల విశ్వాసం కోల్పోయాయని, ప్రజలు బీజేపీని ఆదరిస్తున్నారని చెప్పారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు బీజేపీని గెలిపిస్తారని ధీమా వ్యక్తంచేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు శేరిరాంరెడ్డి తదితరులు పాల్గొనారు.

జోరుగా వాహనాల తనిఖీ



తనిఖీలు చేస్తున్న పోలీసులు

అనంతగిరి: సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పోలీసులు వాహనాల సోదాలను ముమ్మరం చేశారు. వికారాబాద్–హైదరాబాద్ వంతెన సమీపంలో మిషన్ స్కూల్ చౌరస్తా వద్ద మంగళవారం ఉదయం వికారాబాద్ సీఐ శ్రీను ఆధ్వర్యంలో సాయుధ బలగాలతో కలిసి వెహికిల్స్‌ను తనిఖీ చేశారు. ఇదే సమయంలో వికారాబాద్ పట్టణానికి వెళ్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ కోటిరెడ్డి తనిఖీల ప్రక్రియను పర్యవేక్షించారు.

రక్తదాతలు.. ప్రాణదాతలు



ప్రశంసా పత్రాలను అందజేస్తున్న డీఎస్పీ

తాండూరు టౌన్: రక్తదానం చేసిన వారు ప్రాణదాతలని తాండూరు డీఎస్పీ శేఖర్ గౌడ్ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం పట్టణంలోని ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు పోలీసు సిబ్బందితో పాటు యువకులు రక్తదానం చేశారు. రక్తదానం వలన ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి పునర్జన్మను ప్రసాదించిన వారవుతారని పేర్కొన్నారు. తరచూ రక్తదానం చేయడం వలన ఆరోగ్యంగా ఉంటారని డీఎస్పీ తెలిపారు. అనంతరం రక్తదానం చేసిన వారికి ప్రశంసా పత్రాలను అందజేశారు.

బీఆర్‌ఎస్‌కు భారీ మెజార్టీ ఖాయం

- తండాలను పంచాయతీలుగా మార్చిన ఘనత సీఎందే
- కాంగ్రెస్ పథకాలకు గ్యారంటీ లేదు
- ఆ పార్టీ.. ప్రజల విశ్వాసం కోల్పోయింది
- ఇంటింటి ప్రచారంలో గులాబీ శ్రేణులు



యాలాల: బాణాపూర్‌లో ప్రచారం చేస్తున్న ప్రమోదిని తదితరులు



పార్టీలో చేరిన వారితో ఎంపీ

యాలాల: బీఆర్‌ఎస్ పార్టీకి యాలాల మండలం కంచుకోట అని, రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డికి భారీ మెజార్టీ ఖాయమని రోహిత్ తల్లి, వికారాబాద్ జెడ్పీటీసీ సభ్యురాలు ప్రమోదిని, తాండూరు ఏఎంసీ మాజీ చైర్మన్ విఠల్ నాయక్ ఆశాభావం వ్యక్తంచేశారు. మంగళవారం మండల పరిధి బాణాపూర్, అన్నసాగర్, పగిడియాల, బాగాయిపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. అనంతరం మాట్లాడారు. తండాలను పంచాయతీలుగా మార్చిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని, గిరిజనులకు రాష్ట్రంలో తగిన ప్రాధాన్యత బీఆర్‌ఎస్ ప్రభుత్వం కల్పించిందని పేర్కొన్నారు.

వాటికి గ్యారంటీ లేదు..

కాంగ్రెస్ పార్టీ గ్యారంటీ పథకాలకు గ్యారంటీ లేదని, వాటిని తెలంగాణ ప్రజలు నమ్మే స్థితిలో లేరని ప్రమోదిని ఎద్దేవా చేశారు. అసలు కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో విశ్వాసం కల్పోయిందని ఆరోపించారు. ప్రజలకు గతంలో ఇచ్చిన హామీల కంటే ఎక్కువగా సీఎం కేసీఆర్ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారని తెలిపారు. రాష్ట్ర ప్రజలు మరోమారు కేసీఆర్‌తో పాటు రోహిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం ప్రమోదిని గిరిజన సాంప్రదాయ వస్త్రాధారణలో ఆకట్టుకున్నారు. ఇందులో పార్టీ గౌరవ అధ్యక్షుడు మల్లారెడ్డి, కోఆప్షన్ సభ్యుడు అక్బర్‌బాబా, మాజీ సర్పంచ్ సాయిలు, సొసైటీ డైరెక్టర్ అశోక్‌రెడ్డి ఉన్నారు.



తాండూరు రూరల్: సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

బీఆర్‌ఎస్‌తోనే సంక్షేమ పథకాలు

పెద్దేముల్: బీఆర్‌ఎస్‌తోనే పేదలకు సంక్షేమ పథకాలు దక్కుతాయని ఆ పార్టీ మండల నాయకులు అన్నారు. మండల కేంద్రంలో ఇంటింటికీ తిరిగి ప్రచారం చేశారు. తాండూరు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డికి ఓటు వేయాలని ప్రజలను కోరారు. మూడోసారి కేసీఆర్ ప్రభుత్వాన్ని ఆదరించాలన్నారు. తాండూరు ప్రాంతం అభివృద్ధికి కోట్లాది రూపాయల నిధులు తీసుకొచ్చిన ఘనత రోహిత్‌రెడ్డికే దక్కిందని, రెండోసారి భారీ మెజార్టీతో ఆయన్ను గెలపించాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు నరేష్‌రెడ్డి, ఉపేందర్, శీల్లి, ప్రసాద్, రంగయ్య, చందర్ తదితరులు పాల్గొన్నారు.

రైతు ప్రభుత్వం..

మోమిన్‌పేట: మాజీ జెడ్పీటీసీ మల్లారెడ్డి ఎమ్మెల్యే ఆనంద్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఆయనతో పాటు ఎన్కేపల్లి మాజీ సర్పంచ్ అంజయ్య గులాబీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ఇది రైతు ప్రభుత్వం అని, రైతులకు మేలు చేసే కేసీఆర్‌ను ఆదరించాలని, అందుకు ప్రతి ఒక్కరూ కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రైతుబంధు మండల అధ్యక్షుడు అజీజ్, మల్లయ్య ఉన్నారు.



మోమిన్‌పేట: పార్టీలో చేరిన మల్లారెడ్డికి గులాబీ కండువా కప్పుతున్న ఎమ్మెల్యే ఆనంద్

కాంగ్రెస్‌వి హత్యారాజకీయాలు

తాండూరు రూరల్: తాండూరు అభివృద్ధి రోహిత్‌రెడ్డితోనే సాధ్యమని, అసెంబ్లీ ఎన్నికల్లో తిరిగి ఆయన్నే గెలిపిద్దామని ఎల్మకన్నె పీఏసీఎస్ చైర్మన్ రవిగౌడ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఉమాశంకర్ పటేల్ అన్నారు. స్థానిక ఫంక్షన్‌హాల్లో బీఆర్‌ఎస్ మండల శ్రేణుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిపై జరిగిన దాడి హేయమైన చర్యగా అభివర్ణించారు. బీఆర్‌ఎస్ గెలుస్తుందని తెలిసి, కాంగ్రెస్ హత్యరాజకీయాలకు పాల్పడుతోందని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు రాజప్ప, రాంలింగారెడ్డి, నరేందర్‌రెడ్డి, గౌడి వెంకటేశం, వీరేంద ర్‌రెడ్డి, రఘునాథ్‌రెడ్డి, శంషోద్దీన్, సందీప్ రెడ్డి, శేఖర్, రఘునాథ్‌రెడ్డి, ఆర్‌సీ గౌడ్, యాదప్ప, శ్రీనివాస్, శేఖర్‌రెడ్డి ఉన్నారు.

ఎంపీ రంజిత్‌రెడ్డి సమక్షంలో..

బంట్వారం: ఎంపీ రంజిత్‌రెడ్డి సమక్షంలో కోట్‌పల్లి మండలం బార్వాద్‌కు చెందిన పలువరు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎంపీ వారికి గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో బార్వాద్ సర్పంచ్ వెంకటేశ్ యాదవ్, పీఏసీఎస్ చైర్మన్ రాంచంద్రారెడ్డి, నాయకులు మహేందర్‌రెడ్డి, సంగారెడ్డి, పెంటయ్య, అంజయ్య, రవీందర్‌రెడ్డి, మైనొద్దీన్, గౌరీశంకర్, అశ్విన్‌రెడ్డి పాల్గొన్నారు.

దేశానికే ఆదర్శం

దోమ: సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే మహేశ్ రెడ్డి అన్నారు. దోమ మండలం దాదాపూర్, బుద్లాపూర్ గ్రామాలకు చెందిన పలు పార్టీల కార్యకర్తలు జెడ్పీటీసీ నాగిరెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరగా.. వారికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను గెలిపించేందుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని కోరారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం



పార్టీలో చేరిన వారితో మంత్రి మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

కొడంగల్ రూరల్: ప్రజా సంక్షేమమే ముఖ్యమంత్రి కేసీఆర్ లక్ష్యమని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు మేలు చేస్తున్నాయని మంత్రి మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. స్థానిక ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో చిట్లపల్లి, ఉడిమేశ్వరం గ్రామాలకు చెందిన పలువురు ఎమ్మెల్యే ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరగా.. వారికి ఇరువురు గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

కాంగ్రెస్ దిష్టిబొమ్మ దహనం

అనంతగిరి: మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డిపై జరిగిన హత్యాయత్నాన్ని ఖండిస్తూ మంగళవారం రాత్రి వికారాబాద్ పట్టణంలో బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎంపీపై జరిగిన హత్యాయత్నాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు విజయ్ కుమార్, పార్టీ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, మంచన్ పల్లి సురేష్ కుమార్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం

కుల్కచర్ల: భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని ఆ సంఘం మండలం అధ్యక్షుడు ఐలగారి కృష్ణయ్య కోరారు. బొంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన చాంద్ పాష కుల్కచర్లలో భవన నిర్మాణంలో పనిచేస్తూ కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న నిర్మాణ కమిటీ సభ్యులు మంగళవారం ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న బాధితున్ని పరామర్శించారు. అనంతరం తక్షణ ఆర్థిక సహాయంగా రూ.10వేలు అందజేశారు. ఇందులో సంఘం నాయకులు బాలయ్య, శ్రీనివాస్, అంజిలయ్య, బాబు ఉన్నారు.

నూతన నియామకం

అనంతగిరి: అంబేడ్కర్ ప్రజా సంఘం జిల్లా అధ్యక్షుడిగా కాలే సురేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా ముత్తెరగల్ల ప్రభాకర్‌ను నియమించారు. ఈ మేరకు మంగళవారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కట్టెల మల్లేశం వారికి నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మల్లేశం మాట్లాడారు. దేశానికి పూలే, అంబేడ్కర్‌ల ఆలోచన విధానమే శరణ్యమన్నారు. అంబేడ్కర్ తన జీవిత కాలమంతా కుల నిర్మూలన కోసం పనిచేశారని, అది జరిగిన నాడే దేశం సర్వతో ముఖాభివృద్ధి చెందడానికి అవకాశం ఉందన్నారు. అందుకు వారు చూపిన మార్గంలో నడవాలని సూచించారు. ఇందులో అంబేడ్కర్ యువజన సంఘం ఎన్కతల అధ్యక్షుడు ఎంపల్లి క్రాంతి కుమార్, సంఘం చించల్ పేట్ మాజీ అధ్యక్షుడు దుర్గయ్య, మోమిన్‌పేట్ మండల నాయకులు ప్రవీణ్ కుమార్, ఎన్కతల మాజీ అధ్యక్షుడు రమేష్, సంఘం కొత్తగడి నాయకులు ఆనంద్ కుమార్, వెంకటేశ్, శ్రీనివాస్, విజయ్ కుమార్, ప్రవీణ్ ఉన్నారు.

వరి కోతలు షురూ..

- వేధిస్తున్న కూలీల కొరత
- కోత యంత్రాలను ఆశ్రయిస్తున్న రైతులు
- ధరలు పెంచుతున్న యజమానులు
- ఇబ్బందుల్లో అన్నదాతలు



దౌల్తాబాద్: వానాకాలం సీజన్ ప్రారంభంలో నాట్లు వేసిన వరిచేలు కోతకు వచ్చాయి. కూలీల కొరత నేపథ్యంలో యంత్రాల సాయంతో కర్షకులు కాలం నెట్టుకొస్తున్నారు. ఇదే అదనుగా భావించిన మిషన్ల యజమానులు రేట్లు పెంచుతూ రైతులపై భారం మోపగా.. యంత్రాల పనితీరుపై వ్యవసాయ శాఖ దృష్టి సారించి, ధరలు అదుపులో ఉండేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

యాసంగిలో 6వేల ఎకరాలు..

మండల పరిధిలో యాసంగి సీజన్‌లో సుమారు 6వేల ఎకరాల్లో రైతులు చెరువులు, బోరు బావుల కింద వరిసాగు చేశారు. వానాకాలంతో పోలిస్తే ఈ సీజన్‌లో వాతావరణంలో వచ్చిన మార్పులతో వరికి తెగుళ్ల బెడద ఎక్కువయింది. దీంతో దిగుబడి తగ్గి, కనీసం పెట్టుబడి కూడా వచ్చేది కష్టమేనని కర్షకులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఇదిలా ఉండగా.. ఇప్పటికే పలు చోట్ల రైతులు వరిని కోసి రాశులుగా పోశారు. ఐకేపీ, పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాలు లేక ఇబ్బందిగా మారిందని వాపోతున్నారు. దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయం తీసుకోవాలని వేడుకుంటున్నారు.

నష్టపోతున్నాం



వరిసాగు చేసినా ప్రభుత్వం కొనేందుకు ముందుకు రావడం లేదు. కూలీలు దొరకక పోవడంతో వరి కోత మిషన్లతో పనిచేయించుకుందామంటే.. వాటి యజమానులు ఇష్టానుసారంగా ధరలు పెంచుతున్నారు. తద్వారా తీవ్రంగా నష్టపోతున్నాం.

– బసయ్య, దౌల్తాబాద్

రాయితీపై యంత్రాలు..



గతంలో వ్యవసాయ పనిముట్లను రాయితీపై ఇచ్చేవారు. వరికోత యంత్రాలు అందించేవారు. ప్రస్తుతం అవేవీ లేకపోవడంతో ప్రైవేట్ వ్యక్తులు దోపిడీకి తెగబడుతున్నారు. నష్టపోతున్నాం. అధికారులు స్పందించి వరికోత మిషన్లను సబ్సిడీపై రైతులకు అందజేయాలి.

–నర్సప్ప, రైతు, దౌల్తాబాద్

కార్మిక వ్యతిరేకులను తిప్పి కొడతాం

ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ విజయలక్ష్మి పండిట్

తాండూరు టౌన్: కార్మిక హక్కులను కాలరాస్తున్న కార్మిక వ్యతిరేక శక్తులను తిప్పి కొడతామని ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ విజయలక్ష్మి పండిట్ అన్నారు. మంగళవారం ఏఐటీయూసీ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా తాండూరు సీసీఐ, పెన్నా సిమెంట్ కర్మాగారాలు, పట్టణ మున్సిపల్ కార్యాలయం వద్ద జెండా ఎగర వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. 1920 అక్టోబర్ 31న తొలి కార్మిక సంఘాన్ని లాలా లజపతిరాయ్ అధ్యక్షతన ఏర్పాటు చేశారని తెలిపారు. కార్మికుల హక్కుల కోసం పోరాటాలు చేసి, 8 గంటల పని దినాన్ని సాధించారని వెల్లడించారు. దేశంలో పెట్టుబడి దారులకు అనుకూలంగా కార్మిక చట్టాలను తీసేయాలనే ఆలోచనలో ప్రభుత్వాలు ఉన్నాయని వారు ఆరోపించారు. కార్మికుల హక్కుల సాధనకు, సమ సమాజ నిర్మాణానికి ఏఐటీయూసీ నిరంతరం పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో హేమంత్, బాలశంకర్ గౌడ్, వంశీకృష్ణ, మునీర్ అహ్మద్, శంకర్, శేఖర్, ఇస్మాయిల్, వెంకటేశ్, రవీందర్, దశరథ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ కార్యాలయం వద్ద జెండా ఎగురవేత

నిరుద్యోగులతో నామినేషన్లు వేయిస్తాం

తాండూరు టౌన్: బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా శాసనసభ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా పలు నియోజకవర్గాల్లో నిరుద్యోగులు, దళితులు, అమరవీరుల కుటుంబ సభ్యులతో నామినేషన్లు వేయిస్తామని, తాండూరులో 100 మందితో నామినేషన్లు వేయించి రోహిత్‌రెడ్డిని ఓడిస్తామని తెలంగాణ యూత్ ఫోర్స్ రాష్ట్ర అధ్యక్షుడు బింగి రాములు, దళిత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కోహిర్ లాజరస్‌లు అన్నారు. మంగళవారం స్థానికంగా నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. తెలంగాణలో నిరుద్యోగులకు కొలువులు కరువయ్యాయని, అమరవీరుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోలేదని, దళితబంధు పేరుతో ప్రజాప్రతినిధుల అనుచరులకే ఫలాలు దక్కాయని ఆరోపించారు. సీఎం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా వందల నామినేషన్లు వేయించి, గుణపాఠం చెబుతామన్నారు.

రానున్నది ఇందిరమ్మ రాజ్యమే



ధారూరు: పార్టీలో చేరిన వారితో మాజీమంత్రి ప్రసాద్‌కుమార్

- పార్టీలకు అతీతంగా గ్యారంటీ పథకాలు
- ఇంటింటి ప్రచారంలో కాంగ్రెస్ నేతలు
- సొంత పార్టీని వ్యతిరేకిస్తున్న గులాబీ శ్రేణులు
- మాజీమంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్

కుల్కచర్ల: తెలంగాణ రాష్ట్రంలో రానున్నది ఇందిరమ్మ రాజ్యమేనని కాంగ్రెస్ పార్టీ చౌడాపూర్ మండలం అధ్యక్షుడు ఎల్పటి అశోక్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటయ్యలు ఆశాభావం వ్యక్తంచేశారు. మంగళవారం కొత్తపల్లి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాల గురించి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నిరుపేదలకు మేలు జరగాలంటే కాంగ్రెస్ అధికారంలోకి రావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని పేర్కొన్నారు. ఇప్పుడు కొందరికి మాత్రమే సంక్షేమ ఫలాలు అందుతున్నాయని, హస్తం అధికారంలోకి వస్తే కులమతాలు, పార్టీలకు అతీతంగా పథకాలు అందుతాయని తెలిపారు. ఇందులో పార్టీ మండల ఉపాధ్యక్షుడు నర్సింహ నాయక్, ప్రధాన కార్యదర్శి దామోదర్ రెడ్డి, యువజన విభాగం అధ్యక్షుడు రాము, నాయకులు రమేష్, చెన్నయ్య, శ్రీను, గోపాల్, అంజు, సతీష్ ఉన్నారు.

కష్టపడిన వారికి సముచిత స్థానం..

ధారూరు: బీఆర్‌ఎస్ పాలనను ప్రజలతో పాటు ఆ పార్టీ నేతలు సైతం వ్యతిరేకిస్తున్నారని, అందుకే స్వచ్ఛందంగా జాతీయ పార్టీ కాంగ్రెస్‌లో చేరుతున్నారని ఆ పార్టీ వికారాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి, మాజీమంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. ఎమ్మెల్యే ఆనంద్ స్వగ్రామం నుంచి పలువురు బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరగా.. వారికి మాజీమంత్రి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడారు. ఉన్నవారితో పాటు కొత్తగా పార్టీలో చేరిన వారంతా తన విజయం కోసం పనిచేయాలని, తదనంతరం కష్టపడిన వారందరికీ పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ ధారూరు మండలం అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాస్, నాయకులు మహ్మద్ బాబాకాన్, మల్లారెడ్డి, ఇబ్రాహిం, ఫజిల్, ముజాఫర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ హామీలు తుస్: అనన్య

ధారూరు: ఎన్నికలైన రెండుసార్లు మేనిఫెస్టోలను అడ్డం పెట్టుకుని, మాయమాటలతో పరిపాలించిన బీఆర్‌ఎస్ హామీలన్ని తుస్ మన్నాయని, ఆ పార్టీ నాయకుల మాటలను ప్రజలెవరూ విశ్వసించడం లేదని మాజీమంత్రి కూతురు అనన్య అన్నారు. స్టేషన్‌ధారూరు, డీకెతండాలో ఆమె పార్టీ నాయకులతో కలిసి కాంగ్రెస్ అభ్యర్థి ప్రసాద్‌కుమార్‌కు మద్దతుగా ఇంటింటి ప్రచారం చేశారు. అనంతరం మాట్లాడారు. గతంలో ఇందిరమ్మ ఇళ్లు ప్రతి ఒక్కరికీ వచ్చాయని, ఈ ప్రభుత్వంలో ఏ ఒక్కరికైనా వచ్చాయా అని ఆమె ప్రశ్నించారు. మానాన్న లాంటి నాయకుడు దొరకరని, నిత్యం మీ గురించే మాట్లాడతారని, కాంగ్రెస్‌ను బలపర్చి చేతి గుర్తుకు ఓటేసి ఆయన్ను గెలిపించాలని ఆమె కోరారు. ఇందులో పార్టీ మండల అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ పట్లోళ్ల రాములు, నాయకులు గఫార్, మహ్మద్ బాబాఖాన్, మాన్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

మన రాజును మనమే ఎన్నుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న అధికారి

పరిగి: మనల్ని పరిపాలించే రాజును మనమే ఎన్నుకోవాల్సి ఉంటుందని, అది కేవలం ఓటు హక్కుతోనే సాధ్యమని స్వీప్ నోడల్ అధికారి మల్లేశం అన్నారు. మంగళవారం పట్టణ కేంద్రంలోని పల్లవీ డిగ్రీ కళాశాలలో ఓటు హక్కు వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఓటు వజ్రాయుధం లాంటిదని, నవంబర్ 30న జరగబోయే శాసనసభ ఎన్నికల్లో ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ, ఎలాంటి ప్రలోభాలకు మొగ్గుచూపకుండా నిజాయతీగా వినియోగించుకోవాలని చెప్పారు. విద్యార్థులు తల్లిదండ్రులకు చెప్పి, ఎలాంటి కానుకలు తీసుకోకుండా ఓటును వినియోగించుకునే విధంగా తమవంతు కృషి చేయాలన్నారు.

రామ్మోహన్‌రెడ్డిని గెలిపించాలి

పూడూరు: ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి రామ్మోహన్ రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించాలని ఆయన సతీమణి ఉమారెడ్డి అభ్యర్థించారు. ఇంటింటి ప్రచారంలో భాగంగా ఆమె గొంగుపల్లిలో ఆరు గ్యారంటీ పథకాల గురించి ప్రజలకు వివరించి మాట్లాడారు. గతంలో కాంగ్రెస్ చేసిన అభివృద్ధే కనిపిస్తుందని, బీఆర్‌ఎస్‌తో ప్రజలకు తీరని నష్టం వాటిల్లిందని ఆరోపించారు. కాంగ్రెస్‌ను గెలిపిస్తే రాష్ట్రానికి, ప్రజలకు మేలు జరుగుతుందని చెప్పారు. ఇందులో పీఏసీఎస్ చైర్మన్ సతీష్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు సురేందర్, మండల మహిళా అధ్యక్షురాలు బాలమణి, నాయకులు అనుసుజ, నర్సింహులు గౌడ్, రమేష్ ఉన్నారు.

ఓటరు దర్శనం కోసం.. నేతల పాట్లు



ప్రచారంలో ఎమ్మెల్యే, మంత్రి మహేందర్‌రెడ్డి



తండాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు

బొంరాస్‌పేట: ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నాటి నుంచి రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు బిజీబిజీగా ఉన్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా.. ఓటరు దేవున్ని ఆకర్షించేందుకు సామాన్య కార్యకర్త నుంచి మంత్రి వరకు విస్తృతంగా శ్రమిస్తున్నారు. బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, మంత్రి మహేందర్‌రెడ్డి నియోజకవర్గంలో ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. ఓటరు నాడీ తెలుసుకునేందుకు ప్రచార రథంపై రేయింబవళ్లు ర్యాలీలు, డప్పుల మోతలతో ప్రచారం చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎనుముల తిరుపతిరెడ్డి, ఆ పార్టీ నాయకులు ఆరు గ్యారంటీ పథకాల గురించి ప్రజలకు వివరిస్తూ కర పత్రాలు పంచుతున్నారు. గిరిజన తండాల్లో ఎక్కువగా పర్యటిస్తూ చేతికే ఓటెయ్యాలని కోరుతున్నారు. ఇదిలా ఉండగా.. పగలంతా పనిచేసిన శ్రమజీవి.. రాత్రి నిద్రపోదామన్నా నేతలు వదలడం లేదని పలువురు వాపోతున్నారు. ఐదేళ్ల పాటు ఓటర్లు తమ సమస్యల పరిష్కారం కోసం నేతల చుట్టూ తిరిగితే.. ప్రస్తుతం నేతలు ఓటర్ల చుట్టూ ఓట్ల కోసం ప్రదక్షిణలు చేయడం తప్పేమి కాదులే అంటూ రచ్చబండల వద్ద ప్రజల చర్చ.

నిశ్చితార్థం రోజునే.. జవాన్ మృతి

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం



బల్‌రామ్ (ఫైల్)

బొంరాస్‌పేట: నిశ్చితార్థం కార్యక్రమం ముగించుకుని తిరిగి వెళ్తున్న ఆర్మీ జవాన్ రోడ్డు ప్రమాదంలో విగతజీవిగా మారాడు. వివరాలు ఇలా ఉన్నాయి. బషీరాబాద్ మండలం ఇస్మాయిల్‌పూర్ గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ బల్‌రామ్(25) ఇటీవల స్వగ్రమానికి వచ్చాడు. సోమవారం రాత్రి పూడూర్ మండలం తిర్మలాపూర్‌లో బల్‌రామ్ నిశ్చితార్థం జరిగింది. అనంతరం తిరిగి రాత్రి ద్విచక్ర వాహనంపై నవీన్(16) ఇంటర్ విద్యార్థితో కలిసి వెళ్తున్న క్రమంలో జాతీయ రహదారి163పై రేగడిమైలారం సమీపంలో వీరిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో వారిద్దరూ తీవ్రగాయాలతో రోడ్డుపై పడ్డారు. గమనించిన కొందరు పోలీసులకు సమాచారం ఇవ్వగా.. చికిత్స నిమిత్తం క్షతగాత్రులను కొడంగల్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఇద్దరూ చనిపోయినట్లు డాక్టర్లు నిర్ధారించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేసి, పోస్టుమార్టం అనంతరం శవాలను వారి స్వగ్రామానికి తరలించారు. అధికార లాంఛనాలతో ఎస్‌ఐ శంకర్, పోలీసులు జవాన్‌కు నివాళులర్పించారు.